క్లుప్తంగా

నివాళి



సుజాతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డిని సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఆయన తల్లి సుజాతమ్మ(84) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణంలోని నారాయణ రెడ్డి నివాసం వద్దకు వెళ్లి సుజాతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



రాపూరు గ్రంథాలయంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న చంద్రశేఖర్

రాపూరు: విద్యార్థులు విద్యతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో ఎండలో తిరగకుండా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారిణి ధనమ్మ, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిల్లకూరు ఎస్‌ఐగా సుధీర్‌కుమార్



చిల్లకూరు : ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ అంజిరెడ్డి సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో ఎస్‌ఐ సుధీర్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులోని చినబజార్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సుధీర్ కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున ప్రజలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4.21 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.4,21,210ల ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పోలేరమ్మ ఆలయంలోని హుండీలోని కానుకలను సోమవారం ఈవో శశాంక్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ నగదును గ్రామదేవత పోలేరమ్మ జాతరకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. విన్నమాల గ్రామ పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, ధీరజ్ రెడ్డి, జాతర నిర్వాహకులు నల్లబోతుల రామారావు, ఆలయ పూజారి రాయపూడి ముని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీకొని పలువురికి గాయాలు



దెబ్బతిన్న ఆటో


గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో ఇళ్ల సమీపంలో సోమవారం రెండు ఆటోలు ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పాలిచెర్ల గ్రామం నుంచి ఇద్దరు యువకులు ఆటోను అతి వేగంగా నడుపుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గూడూరు నుంచి ఆటో ప్రయాణికులతో పాలిచెర్లకు బయలుదేరింది. టిడ్కో ఇళ్ల వద్ద యువకులు నడుపుతున్న ఆటో అదుపు తప్పి ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో రెండు ఆటోల ముందు భాగం దెబ్బతినింది. యువకులు పరారయ్యారు. ప్రయాణికుల ఆటో ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. అందులోని పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ ప్రమాదం విషయంను రెండవ పట్టణ పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.


30న మండల సమావేశం

వాకాడు : ఈ నెల 30న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

అంగరంగ వైభవం.. రథోత్సవం

- పోటెత్తిన భక్త జనం
- గోవిందనామ స్మరణతో హోరెత్తిన తుమ్మూరు





కరిమాణిక్యస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం టీటీడీ ఆగమ వేదపండితులు కృష్ణస్వామి, టీటీడీ అధికారులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు రథాన్ని లాగేందుకు ఉత్సాహం చూపారు. భక్తుల గోవింద నామ స్మరణతో తుమ్మూరు గ్రామం మారుమోగింది. భక్తులు రథంపై ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పలు కూడళ్ల వద్ద దాతలు భక్తులకు మజ్జిగ, రస్నా తదితర పానీయాలు పంపిణీ చేశారు. ఎస్‌ఐ గోపి తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో టీటీడీ ఆగమ పండితులతో పాటు టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బారాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఈ సుమతి, ఏఈ ఆంజనేయరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌కుమార్ రెడ్డి, సుజల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలాది మంది భక్తులకు అన్నదానం

రథోత్సవం అనంతరం తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యకమంలో తుమ్మూరు యువతతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి మోహన్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామికి తిరుచ్చి ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో టీటీడీ వేదపండితుల వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతం, ఆరాధన, సహస్ర నామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవలను వేదపండితులు శేషాద్రి స్వామి, కిషన్‌స్వామి తదితరులు వైభవంగా చేపట్టారు.

కనుల పండువగా కల్యాణం

శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి కల్యాణాన్ని ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను సింహ వాహనంపై, కరిమాణిక్య స్వామిని గజ వాహనంపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు.



పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దాతలు



అన్నదానం చేస్తున్న తుమ్మూరు యువత



శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

నేడు పార్వేట ఉత్సవం

తుమ్మూరు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారికి పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీకి చెందిన ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. ఉదయం ఆలయం వద్ద చప్పర ఉత్సవంతో పాటు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

కూలీలకు 'ఉపాధి' హామీ



జీలపాటూరు గ్రామంలో చేస్తున్న ఉపాధి పనులు

పెళ్లకూరు : మండలంలోని కూలీలను ఉపాధి హామీ పథకం ఎంతగానో ఆదుకుంటోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. ఖరీఫ్ సీజన్ ఇంకా ప్రారంభం కాలేదు. ఇతర పనులు కూడా లేవు. ఈ క్రమంలో జీవనాధారం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఉపాధి హామీ పథకం ఆదుకుంటోంది. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి ప్రభుత్వం 150 పనిదినాలు కల్పిస్తోంది. అంతేగాక వేసవిలో అదనపు వేతనం ఇస్తోంది. తద్వారా ప్రజలు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 9,917 జాబ్‌కార్డులు ఉన్నాయి. వారికి ఫిబ్రవరి నుంచి క్యాటిల్ పాండ్, చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, వ్యవసాయ కాలువ గట్లపై గడ్డి తొలగించడం తదితర పనులను ప్రభుత్వం చేపట్టింది. ఆయా గ్రామాల ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు నిబంధనల మేరకు పనులు చేయిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ పనికల్పించడంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వేసవి ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేలా ఎఫ్‌ఏలు ముందుస్తు జాగ్రత్తలు సైతం తీసుకుంటున్నారు. కూలీలకు అందుబాటులో తాగునీరు, మెడికల్ కిట్లు ఉంచుతున్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే వడదెబ్బ బారిన పడకుండా ఉదయం తొందరగా కూలీలు పని ప్రదేశానికి చేరుకుని ఎండ తీవ్రంకాక ముందే ఇళ్లకు చేరుకునేలా చూస్తున్నారు. మండలంలోని నెలబల్లి, కలవకూరు, అనకవోలు, జీలపాటూరు, తాళ్వాయిపాడు తదితర గ్రామాల్లో పనులు పూర్తి చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో మస్టర్లు నమోదు చేస్తున్నారు. 150 పని దినాలు పూర్తి చేసేందుకు అన్ని ప్రాంతాల్లోనూ చర్యలు తీసుకుంటున్నారు. చెరువులు, గుంతల్లో పూడికతీత పనులు చేయించడం వల్ల నీటినిల్వలు పెరిగేందుకు అవకాశం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఉపాధి కూలీలు నాలుగు గంటలు పనిచేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఈసీ దామోదర్‌రాజు

దక్కిలి: ఉపాధి కూలీలు రోజూ నాలుగు గంటలకు తగ్గకుండా పని చేయాలని ఈసీ దామోదర్‌రాజు తెలిపారు. ఆయన సోమవారం మాటుమడుగు పంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న ఊటగుంట పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని దినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనులకు వచ్చే కూలీలకు రూ.300 వేతనం తగ్గకుండా పనులు చూపించాలన్నారు. కూలీలు మార్కింగ్ ప్రకారం పనులు చేయాలని తెలిపారు. కూలీలుకు సకాలంలో వేతనం అందేలా మస్టర్లను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు.

హైకోర్టు ఆదేశాలను అమలుచేయాలని వినతి



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న వెలుగోటి సాయిగుణరంజన్ యాచేంద్ర

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పాగొట్టం కాలనీలో వెంకటగిరి రాజాలకు సంబంధించిన భూముల్లోని అక్రమ కట్టడాలు, రిజిస్ట్రేషన్ లేని ఇళ్లను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని రాజా కుటుంబ సభ్యుడు వెలుగోటి సాయిగుణరంజన్ యాచేంద్ర కోరారు. ఆయన సోమవారం మున్సిపల్ అధికారులను కలిసి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాగొట్టం కాలనీలో రాజా కుటుంబ సభ్యులకు సంబంధించి భూములు ఉన్నాయని తెలిపారు. వాటిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వాటిపై గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హైకోర్టుకు నివేదికలు ఇచ్చారని పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నిర్మాణాలను తొలగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లేకపోవడంతో ఆర్‌ఐ షాజహాన్‌కు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులను కలిసి కోర్టు ఉత్తర్వులను అందజేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక న్యాయవాది చదలవాడ కుమార్ ఉన్నారు.

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

– డోలు విద్వాంసుడికి కళాకారుల సత్కారం



పద్మశ్రీ అవార్డు గ్రహీత పళనీవేల్‌తో రాష్ట్రపతి అవార్డు గ్రహీత సుబ్రమణ్యం

గూడూరు రూరల్ : అన్ని రంగాలలో ఉన్న కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇచ్చినప్పుడే యువ కళాకారులు పుట్టుకు వస్తారని తమిళనాడుకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కర్నాటక వాయిద్య సంగీత డోలు విద్వాంసులు డాక్టర్ ఏకే పళనివేల్ తెలిపారు. గూడూరు ప్రాంతానికి చెందిన కర్నాటక వాయిద్య సంగీతం డోలు విద్వాన్ వినుకొండ సుబ్రమణ్యం మార్చి 24న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గూడూరులోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఇందులో పళనివేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో కళాకారులకు గుర్తింపు ఉండేదని, కళలను పోషించే వారు ఎక్కువ సంఖ్యలో ఉండేవారని తెలిపారు. నేడు ఆ పరిస్థితి మారిందన్నారు. దీంతో యువత కళలపై మక్కువ పెంచుకోవడం లేదన్నారు. కళపై మక్కువ పెంచుకుని సాధన చేస్తే ఏనాటికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. అలాంటి కోవకు చెందిన వారిలో కర్నాటక వాయిద్య సంగీత డోలు విద్వాన్ సుబ్రమణ్యం అని తెలిపారు. ఆయన కొన్ని సంవత్సరాల పాటు సాధన చేసి ఎన్నో కచ్చేరీలు చేశారని, వాటిని భారత ప్రభుత్వం గుర్తించడంతోనే రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని వివరించారు. ప్రతి ఒక్కరిలోనూ ఇలాంటి తపన ఉంటే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. అనంతరం నాదస్వర, శాక్సాఫోన్ కచ్చేరిలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గూడూరు, నెల్లూరు ప్రాంతాలకు చెందిన డోలు విద్వాంసులు, నాదస్వర విద్వాంసులు, శాక్సాఫోన్ కళాకారులు, పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ఘనంగా చక్రస్నానం



చెన్నకేశవ స్వామి ఆలయంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బొడ్డు చౌక్ ప్రాంతంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామి వారికి చక్రస్నాన ఘట్టాన్ని ఘనంగా చేపట్టారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలోని కొలను వద్దకు తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో స్నానాలు ఆచరించారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చేయూత



నాయుడుపేట హిందూ శ్మశానవాటికను సందర్శించిన శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రారెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తానని శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ దువ్వూరు నారాయణ రెడ్డి తల్లి సుజాతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్మశానవాటికను సందర్శించారు. శ్మశానవాటిలో అంత్యక్రియలు, కర్మక్రియలు జరుపుకోవడానికి పక్కా భవనాలను నిర్మించడంతోపాటు వసతులు కల్పించిన హిందూ ధర్మ సేవా సంఘం సభ్యులను ఆయన అభినందించారు. శ్మశానవాటిలో పూడ్చుల చోట రహదారులు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎంత అవుతుందో చెప్పాలని నిర్వాహకులను కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, హిందూ ధర్మ సేవా సంఘం నాయకులు పీడీ ఉదయశంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు ఉచిత ఖత్నా



ఖత్నా చేసుకున్న పిల్లల తండ్రులకు మందులు అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

గూడూరు రూరల్ : ఖత్నా చేసుకోవడం వల్ల చర్మ సమస్యలు రాకుండా ఉంటాయని ముస్లిం మత గురువు షఫీ మౌలానా తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో సోమవారం పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నాలు చేయించారు. ఈ సందర్భంగా సమితి వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నాలు చేయిస్తున్నామని తెలిపారు. ఖత్నాలు చేసుకున్న పిల్లలకు ఉచితంగా మందులు అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు చైర్మన్ షేక్ జిలానీ బాషా, సీపీఐ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాలేషా, అన్వర్‌బాషా, జిలానీ బాయ్, ఖాదర్ బాషా, యస్థానీ బాషా, కబీర్, నవాజ్, మహ్మద్‌ఆలీ, హసన్, హాషీం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై జాయింట్ సర్వే

చిల్లకూరు : సాగరమాల రోడ్డు పనులకు సంబంధించి కాంట్రాక్టు సంస్థ ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలకు పాల్పడిందనే విషయంపై సోమవారం రెవెన్యూ, గనుల శాఖ సర్వేయర్లు జాయింట్ సర్వే చేపట్టారు. మండలంలోని కలవకొండ రెవెన్యూ పరిధిలో కొంతమంది పేదల భూములను తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి మూడు మీటర్ల మేర తవ్వకాలు చేసిన అనంతరం ఆ భూములను చదును చేసి ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. సంస్థ ప్రతినిధులు సుమారు 30 అడుగుల లోతు మేర తవ్వకాలు చేపట్టారు. దీంతో పక్కనున్న రైతుల భూములు దెబ్బతినే ప్రమాదం ఏర్పడడంతో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ రెండు రోజులు క్రితం తవ్వకాలపై సర్వే చేయాలని చిల్లకూరు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారు అక్కడకి వెళ్లి మట్టిని తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు. సంస్థ ప్రతినిధులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో జాయింట్ సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. చిల్లకూరు ఆర్‌ఐ రమ్యస్వాతి, వీఆర్వో శ్రీనివాసులు, గనుల శాఖ సర్వేయర్, సిబ్బంది సర్వే చేసి నివేదికలను అందజేస్తామని పేర్కొన్నారు.

పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో అంబళ్లు



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న అధికారులు, జాతర నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం అనేకమంది భక్తులకు అంబలి పోశారు. జాతరను పురస్కరించుకుని జరిగే వేడుకల్లో భాగంగా అమ్మవారికి మహా నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానంగా జరిగే జాతర ఘట్టాన్ని మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పోలేరమ్మ ఆలయంతోపాటు పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించే పీఠం వద్ద పూలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఈవో శశాంక్ తెలిపారు.

పండ్ల తోటలతో రైతుకు లాభం

బాలాయపల్లి(సైదాపురం): రైతులు పండ్ల తోటల పెంపకంతో పెట్టుబడి తగ్గి లాభం వస్తుందని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ కె గోపాల్ తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరి చీనీ, నిమ్మ పరిశోధనా స్థానం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులతో కలిసి నిడిగల్లులో రైతు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పంటలు, మేలైన దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం అధిపతి మధుమతి, శాస్త్రవేత్తలు ఎం.రామయ్య, వినోద్‌కుమార్, హరిప్రసాద్, కాందార్ నాయక్ తదితురులు పాల్గొన్నారు.